ఇసుక రాబడితో గ్రామాభివృద్ధి

● ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 6: ఇసుక క్వారీ ద్వారా వచ్చే రాబడితో గ్రామాభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ లోతేటి శివ శంకర్ అన్నారు. శుక్రవారం వీరపునాయునిపల్లె మండలం తంగేడుపల్లెలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణమండలి ఆధ్వర్యంలో ఉచిత ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాపాఘ్ని నదిలో పది హెక్టార్లలో మూడు అడుగు లోతు మేరకు తవ్వి లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను ప్రజల అవసరాల కోసం వినియోగించాలని నిర్ణయించామన్నారు. ఇసుక తవ్వకానికి, రవాణాకు అయ్యే ఖర్చు మాత్రమే తీసుకుని ఇసుకను సరఫరా చేస్తామన్నారు. హద్దులకు లోబడి ఇసుకను తీయాలన్నారు. పంట పొలాలు కోతకు గురికాకుండా ఉండేలా ప్రజల వ్యక్తిగత అవసరాలకు కావాల్సిన ఇసుకను తీసుకోవచ్చన్నారు. ఇసుక తవ్వకంతో గ్రామానికి పర్యావరణానికి ముప్పు కలగకుండా చూడాలని కోరారు.

అనంతరం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు పలు సమస్యలను తెలియజేశారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పాపాఘ్ననది ద్వారా మంచినీరు అందేలా చేయాలని కోరారు. గతంలో పాపాఘ్ని నది వరద కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో నష్టపోయామన్నారు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు నష్ట వివరాలు తెలియజేసినా గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. ఇసుక రీచ్ వచ్చిందని ఇది ప్రజా అవరాసల కోసం కనుక తాము అడ్డుపడమని అన్నారు. అయితే తమ పంట పొలాలకు వరద నీరు రాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుకరీచ్ ద్వారా దాదాపు కోటి రూపాయలు ఆదా అవుతుందని ఆ డబ్బుతో రక్షణ గోడ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రక్షణ గోడ త్వరగా ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం పాపాఘ్ననదిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ రమణారెడ్డి, ఎస్ఐ మంజునాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్ కోసం పాపాఘ్ని నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

3

శనివారం 7 సెప్టెంబరు 2024



జిల్లా ప్రజలకు చవితి శుభాకాంక్షలు


● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్/క్రైం), సెప్టెంబరు 6: వినాయక చవితి పర్వదినాన్ని పునస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు, వేడుకలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలని, వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికీ విఘ్నాలను తొలగించి సంతోషాన్ని ఆనందాన్ని అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జాగ్రత్తలు పాటిస్తూ గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం : ఎస్పీ

కడప (క్రైం), సెప్టెంబరు 6: వినాయకచవితి పర్వదిన సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, మీడియా మిత్రులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్పీ సూచించారు.

జైజై గణేశా..



● నేడు వినాయక చవితి పర్వదినం

● లంబోదరుడి విగ్రహాల తరలింపులో యువకులు

● వాడ వాడలా కొలువుదీరనున్న బొజ్జగణపయ్యలు


కడప (కల్చరల్), సెప్టెంబర్ 6: విఘ్నాలను తొలగించి విజయాలను చేకూర్చే వినాయక చవితి పండుగను ఆబాలగోపాలం అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు. ఏ పని తలపెట్టినా విజయవంతం కావాలని ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు అత్యంత వేడుకగా జరుపుకోనున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వీధి వీధిలో, వాడ వాడలో బొజ్జగణపయ్యలు కొలువుదీరనున్నారు. ప్రతి వీధిలో ఇప్పటికే మండపాలను ఏర్పాటు చేసి వినాయకుడి భారీ విగ్రహాలను తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఇప్పటికే ఎక్కడ చూసినా జై జై గణేశా అంటూ సందడి నెలకొంది.

ఉత్సాహంగా విగ్రహాల తరలింపు

వినాయక చవితి పర్వదినం ఉత్సాహంగా జరుపుకోవాలనే లక్ష్యంతో యువకులు వినాయకుడి భారీ విగ్రహాలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా వారి వారి ప్రాంతాలకు తరలించారు. విగ్రహాలను తీసుకెళ్లే క్రమంలో పీకలను ఊదుతూ పెద్ద శబ్దంతో సందడి చేశారు. జై గణేశా.. జైజై గణేశా అంటూ కేకలు వేశారు. కాగా.. కొలువుదీరిన గణపయ్యలకు మూడు లేదా ఐదు లేదా ఏడురోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. తదుపరి గణేశ్ నిమజ్జనంతో చవితి వేడుకలు ముగుస్తాయి. ప్రస్తుతం గణేష్ నిమజ్జనానికి నీరు పుష్కలంగా ఉంది. అందుకు అనుగుణంగా జిల్లా అదికారులు, పోలీసు యంత్రాంగం వివిధ ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై కూడా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు వివరించారు.

చిన్ని గణపయ్యల విక్రయాలు

చవితి పర్వదినాన్ని ఇంటిలో జరుపుకునేందుకు వీలుగా ప్రజలు చిన్ని చిన్ని బొజ్జ గణపయ్యలను విరివిగా కొనుగోలు చేశారు. అందుకు అనుగుణంగా కడపలోని వివిధ ప్రాంతాలలో మట్టి గణపయ్య విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. విగ్రహాలతో పాటుగా గణపయ్య పూజకు అవసరమైన, ఆయనకు ఇష్టమైన పండ్లు, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో ప్రధాన వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి.













మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్

ప్రకృతి హిత వినాయకుడిని పూజిద్దాం

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు6: ప్రకృతి హిత వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని ప్రజలకు కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోటిరెడ్డి సర్కిల్లో నగర పాలక సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా 2 వేల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు మనందరం సమష్టిగా కృషిచేయడం వల్ల మార్పు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాకేశ్‌చంద్ర, డీఎఫ్ఓ నాగమని, ఏపీ కాలుష్య నియంత్రణమండలి డీఈ పి.శ్రీనివాసరావు, ఏఈ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు తాత్కాలిక రద్దు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : గిద్దలూరు - దిగువమెట్ట రైల్వేస్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో కడప మీదుగా గుంటూరు, తిరుపతి మధ్య నడిచే 17261 ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 17 నుంచి 21వతేదీ వరకు రద్దు చేశామని కడప రైల్వేసీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. అలాగే కడప మీదుగా తిరుపతి, గుంటూరు మధ్య నడిచే 17262 రైలు ఈ నెల 18 నుంచి 21వతేదీ వరకు రద్దు చేశామన్నారు.

కాంట్రాక్టర్లుగా.. అధికారులు..!



● బినామీ పేర్లతో కోట్లాది రూపాయల పనులు

● చేసేది కింది స్థాయి ఉద్యోగం

● పైస్థాయి అధికారులను సైతం మేనేజ్ చేసే స్థాయికి..

● ఇదీ ఎస్పీడీసీఎల్‌లో కొందరి తీరు

ఎస్పీడీసీఎల్ కొందరు అధికారులకు కల్పతరువుగా మారింది. అడ్డగోలు సంపాదనకు ఎస్పీడీసీఎల్‌ను మించిన శాఖ లేదంటారు. ఇంటికి బిగించే కనెక్షన్ మొదలుకుని వ్యవసాయ మోటారు కనెక్షన్లు, అదనపు లైన్లు.. ఇలా ప్రతిదానిలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇది కొందరు అధికారులు చేసే అవినీతి. మరికొందరు మాత్రం బినామీ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి కోట్లకు పడగలెత్తుతున్నారు. అడ్డగోలుగా సంపాదనతో పైస్థాయి అధికారులకు, రాజకీయ నేతలకు లక్షలు పడేస్తూ మేనేజ్ చేసుకుంటున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజం. అయితే రాజకీయ నాయకులను, అధికారులను డబ్బుతో గుప్పెట్లో పెట్టుకున్న అధికారులు ఏళ్ల గడుస్తున్నా అదే ఏరియాలో తిష్ట వేస్తున్నారు. మేం ఎన్నేళ్లయినా ఉంటాం, ఏం పీక్కుంటారో పీక్కోండి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి కేవలం తన ఉద్యోగ బాధ్యతలను మాత్రమే నిర్వహించాలి. అయితే ట్రాన్స్‌కోలో కొందరు అధికారులు ఉద్యోగంతో పాటు బినామీ పేర్లతో కాంట్రాక్టులు చేయడమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. డివిజన్ స్థాయి అధికారులే అడ్డగోలు సంపాదనకు తెరలేపారు. రాజకీయ నేతలను అడ్డుపెట్టుకుని ఒకేచోట తిష్టవేసి తాను సంపాదించుకున్న అవినీతి సొమ్ములో కొంత వారికి పంచుతూ.. కోట్లాది రూపాయల పనులు చేసుకుంటున్నారు. వీరందరికీ పులివెందుల 'సార్' ఆదర్శంగా ఉండడం గమనార్హం. ఆయన బాటలోనే మైదుకూరు, ప్రొద్దుటూరు, దువ్వూరు, వనిపెంట, రాజంపేటలో కింది స్థాయి ఉద్యోగులు కూడా కాంట్రాక్టు పనులు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులకే సవాల్ విసురుతున్నారు. అంతా ఆ సార్ మహిమ అంటూ ట్రాన్స్‌కోలో పెద్ద చర్చ నడుస్తోంది.

పులివెందుల సారా మజాకా

పులివెందుల.. ఈ పేరుకు ఓ ప్రత్యేకత ఉంది. ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేశారు. వారి నాన్న దివంగత రాజశేఖరరెడ్డి రెండుసార్లు సీఎంగా పనిచేశారు. వివేకా హత్యతో పులివెందుల పేరు మారుమోగింది. ఆ కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని సీబీఐ చార్జిషీట్‌లో చేర్చింది. పులివెందుల పేరు అట్ల మోగిపోతే.. ఎస్పీడీసీఎల్‌లో ఓ అధికారి పుణ్యమా అని మళ్లీ ఇప్పుడు ఆ శాఖలో పులివెందుల సార్ పేరు వినిపిస్తోంది. ఆయన అక్కడ దశాబ్దం పైగానే తిష్ట వేశారు. అందరికీ బదిలీలు ఉంటాయేమో నాకు మాత్రం ఉండవు.. నేను ఎక్కడికీ పోను అని ధీమాగా ఉంటారు. ఆ సార్ అక్కడ అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శ ఉంది. జగన్ హయాంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇతర ముఖ్య నేతల పేర్లు చెప్పుకుని పులివెందుల ఎస్పీడీసీఎల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులు ఊడ్చివేసారనే ప్రచారం ఉంది. ఉద్యోగం చేస్తే ఏం మజా ఉంటుంది అనుకున్నారేమో.. రాజకీయ నేతలతో సావాసం చేయడం, సొంత శాఖ పనుల కాంట్రాక్టులు దక్కించుకోవడం ఈయన ప్రత్యేకత. సొంత బంధువు, ఎస్పీడీసీఎల్‌లో పనిచేసే సిబ్బందితో కలసి ఓ సంస్థ ఏర్పాటు చేశారు. ఆ సంస్థకు వార్షిక టర్నోవర్ రూ.3.50 లక్షలు మాత్రమే. అయితే పులివెందుల బాస్ ఆశీస్సులు ఉండడంతో వేంపల్లెలో రూ.17.50 కోట్ల టర్న్ కీ పనులను సొంతం చేసుకున్నారు. 'వినిక' కన్‌స్ట్రక్షన్ పేరిట వేంపల్లెలో రూ.17.50 కోట్లతో పనులు చేపట్టారు. ఆ కాంట్రాక్టులో ఓ అధికారి మామ, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఇద్దరు ఆపరేటర్లు ఉన్నారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయగా సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్‌శర్మ, మహబూబ్‌పీరాలను తొలగించారు. అయితే ఆ సార్‌పై చర్యలు లేకపోవడం గమనార్హం. ఇప్పుడు తిరిగి ఆ ఇద్దరిలో ఒకరిని మీటర్ రీడింగ్ తీసే విధుల్లో పెట్టుకోవడం విశేషం.

ఆయన అవినీతే వీరికి ఆదర్శం

పులివెందుల సార్ బాటలో కొందరు ఎస్పీడీసీఎల్ ఉద్యోగులు పయనించడం మొదలు పెట్టారు. మైదుకూరు డివిజన్‌లోని దువ్వూరు సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ లైన్‌మాన్ ఏకంగా కాంట్రాక్టర్ అవతారమెత్తి రూ.46.15 లక్షలతో 14 పనులు చేయడం గమనార్హం. ఓ సంఘాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలు పనులు చేయడం ప్రశ్నించే అధికారులను బెదిరించడం, ధర్నాలు చేయడం ఈయన ప్రత్యేకత. పైస్థాయి అధికారులను డమ్మీ చేసి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడినట్లు ప్రచారం సాగుతోంది. అడ్డగోలుగా వెనకేసుకున్న ఇతను పైస్థాయి అధికారులను మేనేజ్ చేసే స్థాయికి ఎదిగారంటారు. ప్రొద్దుటూరు, రాజంపేట, మైదుకూరులో ఓ ఏఈ, వనిపెంటలో బినామీ అవతారమెత్తి కోట్లాది రూపాయల పనులు చేయిస్తున్నారు. ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా వీళ్లని ఏం చేయలేరు. ఎందుకంటే ఏ ఎండకా గొడుగు అన్నట్లుగా వీరు పార్టీల గొడుగు పట్టుకుని తిరుగుతుంటారు. ఇకనైనా ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ఎస్పీడీసీఎల్ ఉద్యోగులే కోరుతున్నారు.

నేటి నుంచి మద్యంషాపుల సిబ్బంది సమ్మెబాట

● ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 6: ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మద్యం షాపుల సిబ్బంది శనివారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. ప్రైవేటు వైన్ షాపులు ఏర్పడితే తమ ఉద్యోగాలు ఊడుతాయని తమకు న్యాయం చేయాలంటూ సదరు సిబ్బంది ఇటీవల విజయవాడలో ఎక్సైజ్ శాఖ మంత్రిని కలిసి విన్నవించుకున్నారు. రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకువచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గతంలో లాగా ప్రైవేటు వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది శనివారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. కాగా.. గత వైసీపీ ప్రభుత్వం మద్యందుకాణాల్లో సిబ్బందిని ఓ ఏజన్సీ ద్వారా నియమించారు. దీంతో ప్రభుత్వానికి, ఏజన్సీకి మధ్య ఉన్న కాంట్రాక్టు ముగిస్తే సిబ్బందిని తొలగించవచ్చని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇది ముందే ఊహించిన మద్యం దుకాణాల్లోని సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ గతంలో పలుమార్లు వైసీపీ ప్రభుత్వానికి నివేదికలు పంపారు. స్పందించక పోవడంతో యూనియన్‌గా ఏర్పడి నిరసనకు దిగాలని ప్రయత్నిచారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎక్కడికక్కడ వారి నిరసనను తొక్కేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వమైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి : మంత్రి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 6: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇసుక రీచ్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాజంపేట మండలం బాలరాజుపల్లెలో ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ చార్జీల వసూలుతో వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ప్రజలందరూ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఉచిత ఇసుక విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి




కడప నగరంలో మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి... కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, సెప్టెంబర్ 6: మట్టితో తయారుచేసిన వినాయకుడి ప్రతిమలతో పూజ చేయడం వలన విశేషమైన దైవానుగ్రహాన్ని పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వారు అవుతారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం ఎర్రముక్కపల్లెలోని మారెమ్మ గుడిలో ఆవరణంలో జగద్గురు పీఠం నిర్వహకులు దండే వెంకటసుబ్బయ్య మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమలను 153 మందికి ఉచితంగా జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు సుఖ సంతోషాలతో గడుపుకోవాలన్నారు. జగద్గురు పీఠం నిర్వహకులు దండే వెంకటసుబ్బయ్య ఆద్వర్యంలో మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమలను 153 మందికి ఉచితంగా పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. ఇలాంటి వారిని ఇతరులు కూడా ఆదర్శంగా తీసుకొని మట్టిగణపతి విగ్రహాల పంఫిణీకి ముందుకు రావాలన్నారు. మన పూర్వికులు వినాయక చవితి పండుగ రోజును ఎక్కువగా మట్టి విగ్రహాలనే పూజించేవారన్నారు. ఆలాంటి సంప్రదాయం మళ్లీ మొదలైందన్నారు. ఈ ఒరవడిని ఇలానే ముందుకు తీసుకెళ్లాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం మానవ ధరమ్మమన్నారు. కా బట్టి ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన ప్రతిమలనే పూజించాలన్నారు. వినాయకచవితి పర్వదినం సమస్త శుభాలకు సుభసూచికమన్నారు. నిమజ్జనం రోజున చాలా జాగ్రత్తలను పాటించాలన్నారు. కమిటీ పెద్దలు పిల్లలను, ఈత రాని వారిని నిమజ్జనానికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గురు పీఠం నిర్వహకులు దండే వెంకటసుబ్బయ్య, పుష్పగిరి ప్రదక్షిణ నిర్వహకుడు, న్యాయవాది భారవి, మారెమ్మ గుడి నిర్వహకులు సత్తి భాస్కర్, హెచ్. శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్పనాయుడు, న్యాయవాదులు జి.వి. రమణ, హరేంద్రనాధ్‌రెడ్డి, ఉపాసకులు వరప్రసాద్, గాంధీ, రమణ, రాజశేఖర్, బిజేపీ నాయకులు మధుసూధనరెడ్డి, మాధవి, బాలాజీ సేవా ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమలనే పూజిద్దాం: వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : మట్టిగణపతిలనే పూజిద్దాం, పర్యావరణం కాపాడుదామని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం వైవీయూ లలిత కళల విభాగం ఆద్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాలు తయారు చేశారు. వీటిని పంపిణీ చే శారు. ఈ కార్యక్రమానికి వైస్‌చాన్సలరుతో పాటు ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, అకడమిక్ డీన్ ప్రొఫెసరు ఏజీ దాము చేతుల మీదుగా విగ్రహాలను పంపిణీ చేశారు.

సంబరాలకు గణపయ్యలు సిద్ధం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 6 : సంబరాలకు గణపయ్యలు సిద్ధమయ్యారు. నేడు వినాయకచవితి పర్వదినం సందర్భంగా విగ్రహాల తయారీదారులు గణపతి విగ్రహాలను సిద్ధం చేసి మండపాలకు తరలిస్తున్నారు.

వినాయకచవితి శుభాకాంక్షలు: పుత్తా

కమలాపురం నియోజకవర్గంలోని ప్రజలందరికీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎకో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బలక్షుమ్మ, ప్రస్తుత ప్రిన్సిపాల్ సలీంబాషా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి: సీఐ

చెన్నూరు: ప్రతి మండపానికి అనుమతి తప్పనిసరి అని సీఐ పురుషోత్తంరాజు పేర్కొన్నారు. విద్యుత్ విషయంలో నిర్వాహకులు జాగ్రత్త వహించాలన్నారు. నిమజ్జనం జరిగే వరకు నిర్వాహకులు జాగ్రత్తగా మసలుకోవాలన్నారు.

ముందస్తు వినాయక చవితి వేడుకలు



చిన్నారులతో చైతన్య కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 6: వేంపల్లె చైతన్య హైస్కూల్లో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆద్వర్యంలో వేడుకలు జరిగాయి. చిన్నారులు నృత్య ప్రదర్శనలు, పాటలుపాడారు.



అంగన్వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

సీకేదిన్నె, సెప్టెంబరు 6: చింతకొమ్మదిన్నె మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌లో అంగన్వాడీ కార్యకర్త బీసీ-ఎకు కేటాయించడం జరిగిందని, అంగడివీధి బీసీ-సి, తురకపల్లి బీసీ-ఈ , ఆర్‌ఎస్‌వై కాలనీ మినీ అంగన్వాడీ ఎస్టీకి కేటాయించడం జరిగిందని, ఆసక్తి, అర్హత ఉండే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గురుకుల పాఠశాల సమన్వయకర్తపై చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6: లక్కిరెడ్డిపల్లె అత్యాచార ఘటనపై నిర్లక్ష్యం చేసిన అంబేడ్కర్ గురకుల పాఠశాల సమన్వయకర్త మాధవీలతను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు మనోజ్, శరణ్, దిలీప్‌రెడ్డి, మహేశ్, విద్యార్థి సంఘ నాయకులు అంకన్న, పాల్గొన్నారు.

ఎస్సీ షాపింగ్ గదుల్లో వ్యాపారులకు న్యాయం చేస్తాం : డీడీ

వేంపల్లె, సెప్టెంబరు 6: వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న షాపింగ్ గదుల వ్యాపారులకు న్యాయం చేస్తామని సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతమ్మ తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా గదుల ముందు భాగాన్ని సొంత ఖర్చుతో తొలగించుకొని తయారు చేసుకున్నామని, ఆ డబ్బును ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇప్పించాలని కలెక్టర్‌కు స్థానిక వ్యాపారులు విన్నవించారు. శుక్రవారం డీడీ షాపింగ్ గదులను పరిశీలించి రోడ్డు విస్తరణలో కోల్పోయిన గదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులకు ఖర్చు అయిన డబ్బు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీడీ హామీ ఇచ్చారు.







ఇసుక రీచ్‌పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

చక్రాయపేట, సెప్టెంబరు6: మండలంలోని గండికొవ్వూరు గ్రామంలో పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ శుక్రవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్ నిర్వహించారు. గండికొవ్వూరు సమీపాన పాపాఘ్నిలో సర్వే నెంబర్ 1 నందు 7.55 హెక్టార్లలో ఏడాదికి 75500 క్యూబిక్ మీటర్ల సాధారణ ఇసుక తవ్వకం గురించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామంలోని ప్రజలందరు మాకు ఇక్కడ ఇసుక రీచ్ వద్దని పేర్కొన్నారు. డీఆర్వో వారికి సర్దిచెప్పినా వినలేదు.

పాపాఘ్ని నదీ తీరప్రాంతాలలో వేలాది ఏకరాలు బీడుగా మారిపోతాయని, అందుకే ఇసుక రీచ్‌లు వద్దని రైతులు తెలిపారు. అందుకు ఆయన సమ్మతించి ఇక్కడ రీచ్ ప్రభుత్వం మంజూరు చేసిందని, అయిపా ప్రజలు వద్దంటున్నారని కలెక్టర్‌కు తెలియజేస్తానని చెప్పడంతో శాంతించారు.

పిచ్చికుక్కల దాడి - పలువురికి గాయాలు

వేంపల్లె,సెప్టెంబరు 6: వేంపల్లె పట్టణం ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని బైపాస్‌రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం ప్రాంతంలో పిచ్చికుక్క దారిన వెళ్లే వారిపై స్వైరవిహారంచేసింది. పలువురిని విచక్షణ రహితంగాకరిచింది. దారిన వెళ్లే వారిని వెంబడించి కరిచింది. జమాల్‌వలి, తామస్, వెంకటసుబ్బమ్మ, గోపాల్‌రెడ్డితో పాటు పలువురికి రక్తగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. పట్టణంలోని కుక్కలను ఊరి నుంచి బయటకు పంపాలని ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్ సీజ్ - కేసు నమోదు

వేంపల్లె, సెప్టెంబరు 6: వేంపల్లె పట్టణం కడప రోడ్డులోని పంచాయతీ పార్క్ వెనుక అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఎక్సకవేటర్ ద్వారా టిప్పర్‌తో ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా ఎస్ఐ తిరుపాల్ నాయక్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... డంప్ లోంచి ఇసుకను టిప్పర్‌కు వేస్తుండగా సీజ్ చేశామని తెలిపారు. పట్టుకున్న జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎస్ఐ

సింహాద్రిపురం, సెప్టెంబరు 6: మనతో పాటు మన చుట్టూ ఉన్న పరిషరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలమేరకు ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమంలో బాగంగా స్టేషన్ ఆవరణంలో ఎస్ఐతో పాటు సిబ్బంది పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తాచెదారం తీసివేశారు. మొక్కలకు పాదులు తయారు చేసి నీటిని అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసినాగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 6: నందిమండలం పీహెచ్‌సీని శుక్రవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి నిరుపయోగంగా ఉండటంపై కలెక్టర్ శివశంకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఒక్క కాన్పు కేసు కూడా నమోదు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపై సంబంధిత మెడికల్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే ప్రాంగణంలో ఆధునీకరించిన మరో భవనంలో సెప్టెంబరు చివరి నాటికి పీహెచ్‌సీని నిర్వహించేలా, ప్రస్తుతం భవనంలో లేబర్ వార్డు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ మాసంలో ఆరోగ్య కేంద్రంలో కనీసం పది కాన్పులు నమోదయ్యేలా స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజలు వైద్యానికి కడప, వేంపల్లె ఆసుపత్రులకు పరుగులు తీయకుండా ఇక్కడే మెరుగైన వైద్యాన్ని అందించలన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు : డీఈఓ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్నది సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం కడప నగరం జయనగర్‌కాలనీ ఎస్టీబాలికోన్నత పాఠశాలలో 58వ అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా వయోజన విద్య ఆధ్వర్యంలో అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థులనుద్దేశించి క్రమశిక్షణ, లక్ష్యాలుపై ఆమె వివరించారు. జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి సురేశ్ మహిళా సాధికారత ఆటిట్యూడ్‌పై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టరు సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు మల్లిఖార్జునరెడ్డి, నరసారెడ్డి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: ఎస్ఈ

చెన్నూరు, సెప్టెంబరు 6 : విధుల్లో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని 33కేవీ సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో కార్యాయలం వద్ద సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సంస్థలో ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. ఫిర్యాదులు తక్షణం పరిష్కరించే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు.



వరద బాధితులకు రూ.55 వేలు విరాళం

వేంపల్లె, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దేవస్థాన మాజీ ఈఓ ఎస్‌ఏ ప్రతాప్ రూ.55వేలు విరాళాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి అందించారు. బాధితులకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి పంపన్నుట్లు తెలిపారు.

మాజీ డిప్యూటీ మేయరు సహాయం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : విజయవాడ ఇబ్రహీం పట్నంలో వరద ముంపువాసులకు మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా బ్రెడ్డు, పాలు, మెడికల్ కిట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, బాబ్జి, ఖాదర్, ఆరిఫ్, సొహైల్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం

కడపక రూరల్, సెప్టెంబర్ 6 :నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకొని తద్వారా సత్వర న్యాయం పొందవచ్చని డీఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం చేసి తద్వారా విజయవంతానికి పాటుపడాలన్నారు.

జల సంరక్షణ మన బాధ్యత

కమలాపురం రూరల్, సెప్టెంబరు 6 : జలసంరక్షణ మనందరి బాధ్యత అని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజాపర్వీన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోగటం రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జలసంరక్షణ మన బాధ్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల కన్వీనరు సాయికుమార్, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రెగ్యులర్ చేయాలని రిమ్స్‌లో నర్సుల నిరసన

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 6 : కడప రిమ్స్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని శుక్రవారం వారు కడప కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించారు. సుమారు 14 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న నర్సులను రెగ్యులరైజ్ చేయకుండా వేరొకరిని నియమించే విధంగా జీఓ నెం.115ను రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి నర్సులు సోనీ, జయశ్రీ, నీలవేణి, శివజ్యోతి, కమాల్‌బీ తది తరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట...

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 6: జీఓ 115ను రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ స్టాఫ్ నర్సులు నిరసన చేపట్టారు. ఆ జీఓను రద్దు చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సర్వజన ఆసుపత్రి నర్సులు









'ఉపాధ్యాయ సంఘంపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6: డీఈఓ కార్యాలయ సిబ్బందిపై ఓ ఉపాధ్యాయ సంఘం దౌర్జన్యం చేసిందని, చర్యలు తీసుకోవాలని నాన్‌టీచింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రమేశ్, కార్యదర్శి సాయి ఫణీంద్ర తెలిపారు. డీఈఓ కార్యాలయం ఎదుట డీఈఓ కార్యాలయ సి బ్బంది నిరసన చేపట్టారు. సంఘం ప్రతినిధులు సీనియర్ అసిస్టెంటు నిఖిలేష్, డిప్యూటీ డీఈఓ సీసీ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

'డీఈఓ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

డీఈఓ కార్యాలయ సిబ్బందిపై ఉపాధ్యాయ సంఘాలపై దౌర్జన్యాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేదంటే డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం డీఈఓ కార్యాలయం ఏడీకి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వినతిప్రత్రం అందించారు.

చాంద్‌బీ ట్రస్టు ఆధ్వర్యంలో రొట్టెల పంపిణీ

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 6: చాంద్‌బీ ట్రస్టు ఆధ్వర్యంలో లయన్ పి.మన్సూర్ ఆలీఖాన్ తండ్రి సహకారంతో ప్రతి శుక్రవారం నమాజ్‌కు ముందు దాదాపు 10 మసీదుల వద్ద ట్రస్ట్ మెంబర్స్ సహకారంతో రొట్టెలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అలాగే పది మసీదుల వద్ద యాచకులు తమ రాక కోసం ఎదురు చూస్తుంటారని, కావున ఎన్ని పనులున్నా క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మెంబర్స్ డాక్టర్ తన్వీర్ ఆలీఖాన్, జావీద్ బాషా, మౌలాలి సయ్యద్, మస్తాన్, షఫి, తౌషిఫ్, అప్సర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



రొట్టెలు అందిస్తున్న మన్సూర్ అలీఖాన్

17లోపు లక్ష్యాలు పూర్తి చేయండి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 6:ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను ఈ నెల 17వతేదీ లోపు పూర్తి చేయాలని డ్వాకా ప్రాజెక్టు డైరెక్టర్ ఐజే విజయకుమార్, జాయింట్ కమిషనర్ (వాటర్‌షెడ్) ఆర్.శశిధరరెడ్డి పేర్కొన్నారు. వాటర్‌షెడ్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధించాల్సిన లక్ష్యాల దిశానిర్దేశం చేశారు. వాటర్‌షెడ్ కార్యక్రమం కింద కొత్త పనుల గుర్తించి వాటికి పరిపాలన అనుమతులు తీసుకుని పూర్తినాణ్యత ప్రమాణాలతో ప నులను చేపట్టాలని వివరించారు. రైతులకు కేక్టస్ ప్లాంటేషన్ మీద అవగాహన కల్పించిరైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద అనంతపురం జిల్లా నందు చేసిన కేక్టస్ ప్లాంటేషన్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశం నం దు జిల్లాలోని వాటర్‌షెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ

పత్తి పంటలో పురుగు నివారణ

వల్లూరు, సెప్టెంబరు 6 : వల్లూరు మండలం పైడికాల్వ గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతిపంట పొలాలను వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ రైతులతో మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారణతో అధిక దిగుబడులు సాధించవ చ్చన్నారు. పురుగు ఆశించిన పంటకు ప్రొఫెనోఫోస్ లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున లేదా థయోడికార్బ్ లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున లేదా క్యూనోల్‌ఫాస్ లీటరునీటికి 2.5 మి.లీ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పంట చివరి దశలో ఉన్నట్లయితే లామ్డాపై హాలోత్రిన్ లీటరు నీటికి 1 కలిపి మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ఆశించక ముందే రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలు తీసుకుని రైతులు సకాలంలో మందులు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి శివశైలజ, రైతు సేవాకేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంటు శైలజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ఆధ్వర్యంలో

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 : కడప నగరం విశ్వప్రగతి చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో తుంగా రమణయ్య, తుంగా వెంకటేశ్ ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు వాడాలన్నారు. మట్టివినాయక ప్రతిమలు వాడటం వల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ కలదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వప్రగతి చిట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న జనసేన నేత తుంగా రమణయ్య

గురుకుల్ విద్యాపీఠ్‌లో ముందస్తు వినాయకచవితి వేడుకలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6 :కడప నగరం గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వీరకుమారి గణనాధుల విశిష్టతలను వివరించారు. అలాగే పాఠశాలలో ఏ ర్పాటు చేసిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవీఆర్ విద్యాసంస్థల సీఈఓ ఏఎల్ వివేకానంద, ప్రిన్సిపాల్ మునిచంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న గురుకుల్ విద్యాపీఠ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పూజిద్దాం

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు6: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టివిగ్రహాలు ఏర్పాటు చేసి పూజించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ పిలుపునిచ్చారు. అక్కాయపల్లె వికాస్ హైస్కూలులో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలుపుతూ మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడకుంటే ప్రకృతి మాత కన్నెర్రజేస్తుందన్నారు. అప్పుడు సర్వమానవాళికి హాని సంభవిస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమీద్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వికాస్ హరిక్రిష్ణ



కడప నగరంలో టాటా నూతన కర్వ్ కారును ప్రారంభిస్తున్న మేయర్ సురేశ్‌బాబు, రవీంద్రనాథరెడ్డి, అంజద్‌బాషా తదితరులు



ఉత్తమ సేవా పురస్కారం అందజేత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 6: పులివెందుల జేఎన్టీయూ కళాశాల అధ్యాపకురాలు శేషమహేశ్వరమ్మను ఉత్తమ సేవా పురస్కారం వరించింది. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని అనంతపురం జేఎన్టీయూ వివిధ శిభాగాలలో ఉత్తమ సేవ చేసిన వారికి పురస్కారాలను ప్రధానం చేసింది. ఈ పురస్కారానికి పులివెందుల జేఎన్టీయూలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలు, మానవీయ మరియు ప్రాథమిక శాస్త్ర విగాధిపతి, జాతీయసేవా పథకం కార్యక్రమం అధికారిణీ, సార్వత్రిక మానవ విలువల నిర్వహణ అధికారి అయిన ఆచార్య శేషమహేశ్వరమ్మ ఎంపికైందని ప్రిన్సిపల్ అరుణ కాంతి తెలిపారు. శేషమహేశ్వరమ్మ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించి కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామేశ్వరరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

15 లోగా ఇ-కేవైసీ పూర్తి చేయాలి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 6: ఈనెల 1వ తేదీలోగా ఇ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రంపతాడు, మొయిళ్లకాల్వలో జరుగుతున్న ఇ-పంట నమోదు ప్రక్రియను, ఇకేవైసీని పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూరు, సెప్టెంబరు 6: మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మూడు హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి తెలిపారు. ఇందులో చెన్నూరు బుడ్డాయపల్లె ఓసీ, నజీర్‌బేగ్‌పల్లె మెయిన్ బీసీ, బలసింగాయపల్లె ఎస్సీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.





వరద బాధితులకు విరాళాల సేకరణ



ప్రొద్దుటూరులో సేకరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 6 : విజయవాడ వరదబాధితుల సహాయార్థం ప్రొద్దుటూరులో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో విరాళాల వసూలు కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు నేతృత్వంలో పట్టణంలోని బీసీ ప్రముఖులను కలిసి వరదబాధితుల కోసం విరాళాలు సేకరించారు. మొదటి రోజే లక్షవరకు విరాళాలు వసూలయ్యాయని ఐదులక్షల వరకు సేకరించి విజయవాడకు వెళ్లి అందజేస్తామని రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో సుంకరవేణు, ప్రభుకుమార్, జీసీ పుల్లయ్య, నల్లబోతు నాగరాజు, బత్తుల శ్రీనివాసలుల, తాళ్ళమాపురం మల్లికార్జున, పల్లెపు శ్రీనివాసులు, పరమేశ్వరరావు,వజ్జల వెంకట క్రిష్ణయ్య గోపవరం అంజి,మైలగానీ శ్రీనివాసులు, సంగటి రవీంద్ర పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: వరదబాధితుల కష్టాలను టీవీలలో చూసిన చిన్నారులు చలించిపోయారు. వారికోసం తమవంతు సహాయం చేయాలని భావించారు. దీనితో వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరం యూరో విద్యార్థులు విరాళాలు సేకించారు. మొత్తం రూ.79,500 విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని విద్యాభారతి ఆంధ్రప్రదేశ్‌వారికి జమ చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రయ్య తెలిపారు.

జమ్మలమడుగు..: రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరుజిల్లాల్లో సంభవించిన వరదలవలన నష్టపోయిన బాధితులకు సహాయార్థం జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చాంద్‌బాష ఆధ్వర్యంలో విద్యార్థులు రూ.8 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపారు. వారు మాట్లాడుతూ వరదల వలన నష్టపోయిన ప్రజలకు తమవంతు సహకారంతో 10వ తరగతి విద్యార్థులు రూ.8 వేలు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ అనూరాధ, ఉపాధ్యాయులు అభినందించారు.

బద్వేలు..: పోరుమామిళ్ల రోడ్డులోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు శుక్రవారం వరదబాధితుల సహాయార్థం విరాళాల సేకరణ చేపట్టారు. పట్టణంలో తిరుగుతూ విరాళాలు సేకరించారు. విజయవాడ ప్రజలు వరదతో సర్వం కోల్పోయారని స్వచ్ఛంద సేవా సంస్థలు తమవంతు బాధ్యతగా బాధితులకు విరాళాలు సేకరించి అందజేయనున్నట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ రామకోటిరాజు, కమిటీ మెంబర్లు శ్రీనివాసులు, వెంకటశివానంద, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు, బద్వేలులో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

నిర్లక్ష్యం వీడి పనిచేయండి

●ఎంపీడీఓ లక్ష్మీదేవి

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 6 : మండలంలోని అధికారులు నిర్లక్ష్యం వీడి పనిచేయాలని మైదుకూరు ఎంపీడీఓ లక్ష్మీదేవి అధికారులను ఆదేశించారు. మండలంలోని వనిపెంట గ్రామంలోని పారిశుద్యంపై శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.వనిపెంట గ్రామంలో పలువీధులలో పంచాయతీ కార్యదర్శిలను,సచివాలయం ఉద్యోగులను వెంటబెట్టుకొని తిరగారు.అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడా వరద,మురుగునీరు నిలబడకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

గత ప్రభుత్వ వైఫల్యమే...నీటి ఎద్దడికి కారణం

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 6 : గత ప్రభుత్వ వైఫల్యమే ఈ ఏడాది మున్సిపాలిటీ,మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడికి కారణమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. పుట్టా చొరవతో శాశ్వత జీవోను తీసుకొని రావడం వలన ఎనిమిది ఏళ్ల తరువాత ఎర్రచెరువు జలకళను సంతరించుకొంది. శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎర్రచెరువు వద్దకు చేరుకొని జలహారతి ఇచ్చారు.ఇక నుంచి శాశ్వత జీవో ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు ఏటా రెండు సార్లు నీటిని నింపనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,ఏపీ రవీంద్ర,ఆకుల క్రిష్ణయ్యపిచ్చపాటి వీరారెడ్డి,ధనపాల జగన్ తదితరులు పాల్గొన్నారు.



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బి.కోడూరు, సెప్టెంబరు 6 : మండల పరిధిలోని తంగేడుపల్లె, ప్రబలవీడు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సబ్ యూనిట్ ఆఫీసరు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాత టైర్లు, ప్లాస్టిక్ బకెట్లు, టెంకాయ చిప్పలు తదితర వాటిల్లో వర్షం నీరు నిల్వ ఉండి అందులో లార్వా ద్వారా దోమలు త్వరగావృద్ధి చెందుతాయని వాటిని లేకుండా చూసుకుని ఇంటిని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హైమావతి, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సదరన్ సర్టిఫికెట్లు చూపించాలి

ఎంపీడీవో వెంకటరమణ

ఖాజీపేట, సెప్టెంబరు 6: పక్కజిల్లాల నుంచి సదరన్ సర్టిఫికెట్లు కాకుండా కడప రిమ్స్‌కు వెళ్లి తెచ్చుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిధిలో 23 సర్టిఫికెట్లను గుర్తించామని వారు వెళ్లి 7వ తేదీ నుంచి 25వ తేదీలోపల సదరన్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని లేకుంటే పింఛన్ నిలిపివేస్తామన్నారు. ఆగస్టు నెలలో 28 వెరిఫికేషన్‌కు పంపగా అందులో ఎనిమిది మంది మాత్రమే సర్టిఫికెట్లు తెచ్చుకున్నారన్నారు. మిగతావారిపింఛన్ నిలిపివేశామన్నారు. నోటీసులు ఇచ్చిన ప్రతి ఒక్కరూ వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేలు జరిమానా

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 6: లైసెన్సులు లేకుండా బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో అక్రమంగా చేపలు పడుతున్న వారిపై దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని.. రూ.20వేలు జరిమానా విధించినట్లు మత్స్యశాఖ ఉప సంచాలకురాలు కె.శాంతి తెలిపారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠంలోని మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం బ్రహ్మంసాగర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి శాంతి మాట్లా డుతూ బ్రహ్మంసాగర్‌లో చేపలు పట్టుకోవాలంటే ఖచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఉండేవారికి ప్రాముఖ్యత ఉంటుందని, ఇతర జిల్లాల, మండలాలకు చెందిన వ్యక్తులకు చేపల వేటకు అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్, సొసైటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఏపీ టీం కోచ్‌గా నాయబ్‌రసూల్

పోరుమామిళ్ల, సెప్టెంబరు 6: తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8,9,10 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరగబోయే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఏపీ టీం కోచ్‌గా కడప జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, పోరుమామిళ్ల వాసి మాస్టర్ నాయబ్‌రసూల్‌ను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈపోటీల్లో అన్ని జిల్లాల నుంచి సబ్ జూనియర్స్, జూనియర్స్ క్రీడాకారులు పాల్గొంటున్నారని నాయబ్‌రసూల్ తెలిపారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే ఆది సాయం

జమ్మలమడుగు, సెప్టెంబరు 6: ఇటీవలన కురిసిన భారీ వర్షాలకు విజయవాడలోని పలు ప్రాంతాల్లో వరద బాధితుల సహాయార్థం కోసం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి వెళ్లారు. అందులో భాగంగా గత రెండు రోజులుగా అక్కడ బాధిత ప్రజలతో మాట్లాడి వారికి ఇంటింటికి వెళ్లి దుప్పట్లు, మెడికల్ కిట్లు, ఆహార పదార్థాలు, చీరలు, టవళ్లు పంపిణీ చేశారు. అనంతరం శుక్రవారం విజయవాడలో వరద బాధితులకు పోలీసులు చేస్తున్న సేవలను గుర్తించి రూ.2లక్షలు వితరణ చేసినట్లు తెలిపారు. దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి బృందం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, వేపరాల కుమార్, మహబూబ్‌బాష (జార్జి), జాకీర్, వంగల నాగేంద్రయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో పోలీసులకు సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



కడప నగరంలో టాటా నూతన కర్వ్‌కారును ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు, రవీంద్రనాథరెడ్డి, అంజద్‌బాష

20 టీయంసీలు దాటిన గండికోట నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 6: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం శుక్రవారం 20 టీయంసీలు దాటినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, మైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 600 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.



వినాయక చవితి వేడుకల సందడి



బద్వేలులో అమ్మేందుకు ఏర్పాటు చేసిన వినాయకవిగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 6: జమ్మలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీ యువకులు, భక్తులు వినాయక విగ్రహాలను కేరింతల నడుమ టపాసులు పేల్చి తరలించారు. రెండు రోజుల నుంచి జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో అన్ని గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీలవారు అనుమతులు తీసుకున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు, రామిరెడ్డిపల్లె వీధి, తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను వాహనాల్లో తరలించారు. శనివారం వినాయక విగ్రహాలను కొలువుదీర్చేందుకు ఏర్పాట్లు చేశారు.

కొండాపురం..: మండలంలో వాడవాడల వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడు కొలువుదీరేందుకు మండపాలను అందంగా తీర్చిదిద్దుతు న్నారు. పట్టణంలోని సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద భారీ వినాయకుడు కొలువుదీరనున్నాడు. అదేవిధంగా మరికొన్ని చోట్ల భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

బద్వేలు..: వినాయక చవితి పండుగ సందర్భంగా శుక్రవారం బద్వేలు పట్టణంలో శుక్రవారం సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో పట్టణం కళకళలాడింది. వినాయక చవితికి అవసరమైన పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు వచ్చారు. ప్రధాన వీధులలో విఘ్నేశ్వరునికి మండపాలు సిద్ధం చేశారు.

బద్వేలు రూరల్..: వినాయకచవితి సందర్భంగా నిర్వహకులు వినాయకవిగ్రహాలను తమ ప్రాంతాలకు ట్రాక్టర్లలో ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకెళుతున్నారు. పట్టణంలోని మార్కెట్ బయట ఆవరణలో వినాయకుని పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో కిటకిటలాడింది. అలాగే వినాయకుని చిన్న ప్రతిమలను కూడా తీసుకెళుతున్నారు.

కాశినాయన..: గ్రామాల్లో వినాయక చవితి పండుగ సందడి మొదలయ్యింది. శనివారంనాటి పండుగకు వాడవాడలా వినాయకుడి కోసం మండపాలు సిద్ధంచేశారు. పల్లెల్లో యువత చందాల వసూళ్ళుపోలీసుల అనుమతి, వినాయకుడి విగ్రహాల తరలింపులో బిజీబిజీగాఉన్నారు. సమీప పోరుమామిళ్ళ పట్టణంనుంచి వినాయకుడి ప్రతిమలు పల్లెలకు ట్రాక్టర్‌లపై తరలిపోతున్నాయి.



బద్వేలులో పూజా సామగ్రి పంపిణీ చేస్తున్న యువకులు

ఇప్పటికే దూరప్రాంతాల్లో ఉన్న పలువురు విద్యార్థులు,ఉద్యోగులు గ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పిస్తోంది.

పోరుమామిళ్ల..: సర్కిల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో గణేశ్ ఏర్పాట్ల సందడి మొదలైంది. శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో అన్ని గ్రామాల్ల ట్రాక్టర్లులో పోటాపోటీగా ఎత్తయిన గణనాథుడి విగ్రహాలు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పూజా సామగ్రి కోసం జనం కిటకిటలాడారు. విగ్రహాలు తీసుకెళ్లే సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ఈ ప్రాంతాల్లో గస్తీ కాశారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని ప్రతిపల్లెలో వినాయక చవితిని పురష్కరించుకుని భారీగా విగ్రహాలను కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు నుండి ట్రాక్టర్లపై, ఆటోల్లో తరలిస్తున్నారు. పిల్లలు గణపతి బొప్పా మోరియా అంటూ సంతోషంగా కలిసికట్టుగా తీసుకెళుతున్నారు. శనివారం వినాయక చవితిని పురష్కరించుకుని బ్రాహ్మణులతో వేదమంత్రాలతో విగ్రహాలను ప్రతిష్ఠించి మూడు రోజులపాటు పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమం చేపడుతారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో చిన్న, పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ బాణసంచా పేల్చుతూ మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా నిమజ్జనం చేస్తారు. ఈ మూడు రోజులపాటు భక్తులకోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతోపాటు పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.

గణేశ్ నిమజ్జనానికి కుందూ పరిశీలన

రాజుపాలెం, సెప్టెంబరు 6 : గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి స్థానికంగా ఉన్న కుందూ నది ప్రాంతంలో శుక్రవారం తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎస్ఐ కత్తి వెంకటరమణ స్థలాన్ని పరిశీలించారు. వెల్లాలలో కుందూపై నిర్మించిన కొత్త వంతెన వద్ద గణేశ్ నిమజ్జనానికి అనుకూలంగా ఉంటుందన్నారు. అదే విధంగా కూలూరు, వెలివలి గ్రామ సమీపంలో ఉన్న కుందూపై ఉన్న వంతెనను పరిశీలించారు. నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూఇన్‌స్పెక్టరు అశోక్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 6: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 115 జీవోను వెంటనే రద్దు చేసి అన్ని విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులను వెంటనే రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. రెండు రోజులుగా 115 జీవోకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేశారు. ముందుగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా నిరసన తెలిపి శుక్రవారం కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేసినట్లు వారు తెలిపారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రాలు అందించినట్లు వారు తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులతో తెగుళ్ల నివారణ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 6: పంటపొలాల్లో సస్యరక్షణ ద్వారా తెగుళ్లను నివారణను చేయవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల మండలంలోని పెద్దనపాడులోని పంట పొలాలను ఏడీ నరసింహారెడ్డి, ఏవో శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలిచ్చారు. పత్తిపంటలో రసం పీల్చు పురుగు నివారణకు ఫో వికామిడ్ 0.3 ఎంఎం ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో శైలజ, సతీష్‌రైతులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నందమూరి యువసేవాసమితి నేతలు, వైఎంఆర్‌కాలనీలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 6: నందమూరి బాలకృష్ణ సినీస్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బుడగజంగం కాలనీలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. అనంతరం నందమూరి మోక్షజ్ఞతేజ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున, తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, సింహశేఖర్, మచ్చా నాగభూషణం, కృష్ణచైతన్యారెడ్డి, సురేష్, బాలచెన్నయ్య, పెద్దజమ్మయ్య, మోతి నగేష్, మోతి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మట్టి విగ్రహాలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. శుక్రవారం వైఎంఆర్‌కాలనీలోని అరవింద ఆశ్రమంలోని అరవింద ఇంటిగ్రేటెడ్ స్కూల్లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో 5వవార్డు టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి ,మాచిరెడ్డి రజనీ కాంత్‌రెడ్డి, రామకృష్ణ జ్యువెలర్స్ అధినేత రామకృష్ణ , వంకదార వీరభద్రయ్య పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో డీజేలు వాడితే కఠిన చర్యలు



సూచనలు ఇస్తున్న బద్వేలు సీఐ నాగభూషణం

అట్లూరు, సెప్టెంబరు 6: గణేశ్ ఉత్సవాల్లో డీజేలు వేస్తే కఠిన చర్యలు సీఐ నాగభూషణం సూచించారు. శుక్రవారం అట్లూరు పోలీసుస్టేషన్ లో మండలంలో 65 వరకు గణేశ్ విగ్రహాలకు అనుమతులు ఇచ్చామన్నారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులు బాధ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కేసీ రాజు, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మోక్షజ్ఞ పుట్టినరోజు వేడుకలు



వికాస్‌విహార్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు ,సెప్టెంబరు 6 : నంద మూరి బాలక్రిష్ణ తనయుడు నంద మూరి మోక్షజ్ఞ పుట్టిన రోజు వేడకలు బాలయ్య అభిమానులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వికాస్ విహార్ మానసిక వికలాంగుల పాఠశాలలో వె కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నందమూరి బాలయ్య మోక్షజ్ఞ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షుడు టి రాంప్రసాద్, అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్, ఉపాధ్యక్షుడు యువరాజు, కార్యదర్శి రమేష్ బాబు, సహాయకార్యదర్శి చంద్రశేకర్ యాదవ్, మైనారిటీ అధ్యక్షుడు ఎస్ఎం బాషా, ముస్కిల్ వల్లి, రాముడు, సత్యం, రఫీ, కోనేటి ఓబులరెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన సదస్సు

బద్వేలు ,సెప్టెంబరు6: బద్వేలు పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ ,పీజీ కళాశాలలో శనివారం హెల్మెట్ ఆవశ్యకతపై సెంచురీ పానెల్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన తెలిపారు. అనంతరం లైసెన్స్ కలిగిన వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది రాఘవరెడ్డి, సెంచురీ పానెల్ అధికారులు దిలీప్ సిన్హా, రమేష్‌కుమార్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి , అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోను సవరించాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 6: ఏపీలోని 66 షెడ్యుల్డ్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల చేయాలని ఏపీ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాల సమస్య మీద ముద్రించిన కరపత్రాలను ఎర్రగుంట్ల కార్యాలయంలో విడుదల చేశారు. 5ఏళ్లకు ఒక సారి జీవోను సవరించాల్సి వుండగా 8ఏళ్లు దాటినా సవరించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన బాలిక

జమ్మలమడుగు, సెప్టెంబరు 6: జమ్మలమడుగు మండలంలోని ముద్దనూరు రోడ్డు చిటిమిటి చింతల (పాటి) గ్రామ శివార్లలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిదివ్య (9) అనే బాలిక ఘటనా స్థలంలో మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు ముద్దనూరుకు చెందిన బోయలమైన సుంకన్న భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు సాయిదివ్య, సుప్రియతో కలిసి మైలవరం వెళ్లారు. సాయంత్రం తండ్రి సుంకన్న, కూతురు సాయిదివ్య, సుప్రియలతో కలిసి ద్విచక్ర వాహనంలో ముద్దనూరుకు బయల్దేరాడు. అతని భార్య, కుమారుడు కలిసి బస్సులో వెళ్లారు. మైలవరం నుంచి ముద్దనూరుకు వెళుతున్న సుంకన్న, ఆయన ఇద్దరు కుమార్తెలు చిటిమిటిచింతల శివార్లలో కల్వర్టుకు ఢీకున్నారు. ఈ ప్రమాదంలో సాయిదివ్య మృతిచెందింది. కాగా సుంకన్న, సుప్రియకు తలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన బాలికను జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఘటన జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలం వద్దకు చేరుకని బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఖాజీపేట, సెప్టెంబరు 6: మండల పరిధిలోని ముత్తులూరుపాడుకు చెందిన జి.మేరీ గురువారం నుంచి కనపడకపోవడంతో ఆమె తల్లి చిన్నరెడ్డమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముత్తులూరుపాడుకు చెందిన వెంకటసుబ్బయ్య రెండు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబాన్ని ఆమె పోషిస్తోంది. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగు రోజుల నుంచి మేరీకి జ్వరం వస్తుండడంతో ఖాజీపేట ప్రైవేటు ఆస్పత్రికి ఆడబిడ్డ తీసుకొచ్చి చికిత్స చేయించేది. గురువారం చికిత్స చేయించి బస్టాండు కూడలిలో ఆమెను కూర్చోబెట్టి తినుబండారాలు తీసుకొని వచ్చేసరికి ఆమె కనపడకపోవడంతో బంధువులకు సమాచారం ఇచ్చి విచారించగా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.













